

సమస్యల నమోదుకు 1100 టోల్ ఫ్రీ నంబర్

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ సమస్యనుటోల్ ఫ్రీ నంబరు 1100కు ఫోన్ చేసి నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన స్థితిని, సమాచారాన్ని తెలుసుకునేందుకు ఈ నంబరుకు కాల్ చేయాలని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయాలు, అన్ని మండలాల తహశీల్దారు కార్యాలయాల్లో ప్రతి సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

సందిగ్ధంలో చెరకు రైతు

వచ్చే క్రషింగ్ సీజన్‌పై స్పష్టత ఇవ్వని గోవాడ షుగర్స్ యాజమాన్యం



చోడవరం మండలం సింహాద్రిపురంలో చెరకు సాగు చేయకుండా ఖాళీగా వున్న భూములు

- అగమ్యగోచరంగా ఫ్యాక్టరీ భవిష్యత్తు
- మాటలకే పరిమితమైన డిస్టిలరీ/ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు
- చెరకు సాగుపై రైతుల్లో మీమాంస

చోడవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోనే కాదు.. యావత్ రాష్ట్రంలో సహకార రంగంలో నడుస్తున్న ఏకైక చక్కెర కార్మాగారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జూన్ రెండో వారం వచ్చినా, రానున్న క్రషింగ్ సీజన్‌పై ఇప్పటి వరకు యాజమాన్యం నుంచి ఎలాంటి సమాచారం లేదు. దీంతో చెరకు సాగు చేపట్టాలా? వద్దా? అనే విషయంలో ఫ్యాక్టరీ అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో రైతులు డోలాయమానంలో వున్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 25 వేల మంది సభ్య రైతుల కుటుంబాలు ఎన్నో సంవత్సరాలుగా చెరకు సాగు చేస్తూ వస్తున్నారు. కాలక్రమంలో చెరకుకు కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రకటిస్తున్న మద్దతు అరకొరగా వుండడం, మరోవైపు చెరకు సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ఫ్యాక్టరీకి సరఫరా చేసిన చెరకుకు యాజమాన్యం సకాలంలో చెల్లింపులు జరపకపోవడంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఈ కారణాల వల్ల గత కొన్నేళ్ల నుంచి గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరకు సాగు విస్తీర్ణం తగ్గిపోతూ వస్తున్నది. ఒకప్పుడు సీజన్‌లో ఐదు లక్షల టన్నుల చెరకు క్రషింగ్ జరిగిన ఫ్యాక్టరీలో.. ఇప్పుడు లక్ష టన్నులకు పడిపోయింది. చాలా మంది రైతులు చెరకు సాగుకు స్వస్తిపలికి, సరుగుడు, ఇతర పంటలు వేసుకుంటున్నారు. అయినప్పటికీ ఫ్యాక్టరీ పరిధిలో 12,500 హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నారు. గత సీజన్ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వచ్చే సీజన్‌లో చెరకు క్రషింగ్ జరుగుతుందా? లేదా? అన్న సందేహాలు వ్యక్తం చేస్తూనే కార్శీ తోటలను కొనసాగిస్తున్నారు... కొత్తగా మొక్క తోటలు (చెరకు నాట్లు) వేస్తున్నారు. చెరకు సాగుపై రైతుల్లో మక్కువ ఉన్నప్పటికీ, క్రషింగ్‌పై ఫ్యాక్టరీ యాజమాన్యపరంగా ఎలాంటి భరోసా లేదు. ఫలితంగా కొంతమంది రైతులు చెరకు సాగుపై ఇప్పటికీ సందిగ్ధంలోనే వున్నారు. గత సీజన్‌లో వివిధ రకాల కారణాల వల్ల క్రషింగ్‌కు పలుమార్లు అంతరాయం ఏర్పడిది. ముక్కుతూ.. మూలుగుతూ లక్షా తొమ్మిది వేల టన్నుల చెరకు క్రషింగ్ జరిగింది. ఫ్యాక్టరీలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా, క్రషింగ్ సాఫీగా సాగి వుంటే రైతులు కనీసం రెండు లక్షల టన్నుల చెరకును సరఫరాచేసి వుండేవారన్నది నిర్వివాదాంశం. కనీస ప్రోత్సాహం లేనప్పటికీ.. రైతులు ఈ స్థాయిలో చెరకు సరఫరా చేసేందుకు సిద్ధంగా వున్నారంటే.. ఫ్యాక్టరీ నుంచి పూర్తి సహాయ సహకారాలు వుంటే మూడు లక్షల టన్నుల వరకు చెరకు సరఫరా చేసే అవకాశం వుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. కానీ ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి కనీస స్పందన లేకపోవడంతో చెరకు సాగుపై రైతులకు భరోసా కొరవడింది. ఫలితంగా చెరకు ... మిగతా 6వ పేజీలో



చోడవరం మండలం లక్కావరంలో గతంలో చెరకు సాగు చేసిన ఈ పొలంలో ప్రస్తుతం కనిపిస్తున్న సరుగుడు తోట



కాలువలో ప్రవహిస్తున్న నీరు

కోనాం జలాశయం నుంచి 50 క్యూసెక్కులు విడుదల

చీడికాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం జలాశయం నుంచి ఎగువ, దిగువ కాలువల ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్టు ఏఈఈ సిహెచ్. జయరాంపడాల్ తెలిపారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ఆదివారం సాయంత్రానికి 96.55 మీటర్లు వుంది. గత ఏడాది ఇదే తేదీనాటికి 95.5 మీటర్లు ఉంది. ప్రస్తుతం పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవడానికి, వరి నారుమళ్లు పోసుకోవడానికి ఎగువ కాలువకు 10 క్యూసెక్కులు, దిగువ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రైస్ మిల్లులో తనిఖీలు

చోడవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దుర్తి సమీపంలో వున్న వాసవీ రైస్ మిల్లులో ఆదివారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ నిర్వహించారు. ఇక్కడ రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ అధికారి సోదాలు చేశారు. రైస్ మిల్లు గోదాములో నిల్వ వున్న బియ్యంలో కొన్ని నమూనాలను అధికారులు తమ వెంట తీసుకుని వెళ్లారు. కాగా వాసవీ రైస్ మిల్లులో రేషన్ బియ్యం నిల్వలు లేవని, గోదాముల్లో ఉన్న స్టాకుకు, రికార్డుల్లోని వివరాలు సరిపోయాయని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. అయితే ముందు జాగ్రత్తగా కొన్ని బియ్యం శాంపిళ్లను సేకరించామని, నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. ఈ దాడిలో స్థానిక పౌరసరఫరాల శాఖ డీటీ శేషుకుమారితో పాటు, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్‌లో 77.92 శాతం ఉత్తీర్ణత



పెదిశెట్టి శ్రవణ్
381వ ర్యాంకు



కర్రి హేమంత్
525వ ర్యాంకు



జి.సాయి అనీశ్
761వ ర్యాంకు

పరీక్షకు హాజరైన అభ్యర్థులు 1,282

అర్హత సాధించిన అభ్యర్థులు 999

బాలికలు: 670, బాలురు 329

కొత్తూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూ ఆదివారం విడుదల చేసిన ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో జిల్లా నుంచి 77.92 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మశీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లా నుంచి 452 మంది బాలురు, 830 మంది బాలికలు.. మొత్తం 1,282 మంది హాజరయ్యారు. వీరిలో 329 మంది బాలురు, 670 మంది బాలికలు.. మొత్తం 999 (77.92 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇంజనీరింగ్ (ఎంపీసీ) విభాగం నుంచి బాలురు 423 మంది పరీక్ష రాయగా 305 మంది, బాలికలు 498 మంది పరీక్ష రాయగా 384 మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మశీ (బైపీసీ) విభాగంలో బాలురు 29 మంది పరీక్ష రాయగా 24 మంది, బాలికలు ... మిగతా 6వ పేజీలో

ఈదురుగాలుల బీభత్సం

వడ్డాది-పాడేరు రోడ్డులో గరికబంద వద్ద కూలిన చింతచెట్టు

- రెండున్నర గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్
- పలుచోట్ల కూలిన విద్యుత్ స్తంభాలు



గరికబంద వద్ద రోడ్డుపై కూలిన భారీ వృక్షం

మాడుగుల రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి.వర్షం మోస్తరుగా పడినప్పటికీ పెనుగాలులు వీచడంతో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. అంతకుముందు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండతోపాటు ఉక్కపోత వాతావరణం నెలకొంది. సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో ఆకాశం మేఘావృతమైంది. తొలుత తేలికపాటి గాలులు వీచాయి. కొద్దిసేపటి తరువాత గాలుల తీవ్రత పెరిగింది. దీంతోపాటు ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. వడ్డాది-పాడేరు ఆర్అండ్‌బీ రోడ్డులో తాటిపర్తి దాటిన తర్వాత గరికబంద వద్ద భారీ చింతచెట్టు రోడ్డుపై పడిపోయింది. దీంతో పాడేరు వైపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్అండ్‌బీ అధికారులను కూలీలను పురమాయించి చెట్టు కొమ్మలను నరికివేయించారు. రాత్రి ఏడు గంటలకు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. కాగా ఎం.కోడూరు, కూర్మనాథపురం వద్ద విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



ఎం.కోడూరులో విరిగిన విద్యుత్ స్తంభం



బీఎన్ రోడ్డుపై రోలుగుంటలో చెరువును తలపిస్తున్న భారీ గొయ్యి

చెరువుల్లా మారిన గోతులు

- బీఎన్ రోడ్డులో జనం పాట్లు

రోలుగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో బీఎన్ (భీమిలి- నర్సీపట్నం) రోడ్డు పలుచోట్ల గోతులు ఏర్పడి అధ్వానంగా వుంది. ముఖ్యంగా మండల కేంద్రంతో పరిస్థితి దారుణంగా తయారైంది. రోడ్డుకు ఆ చివర నుంచి ఈ చివర వరకు పెద్ద గోతులు ఏర్పడి, వర్షం కురిస్తే నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. గతంలో ఈ గోతులను మట్టి పోసి కప్పడంతో, ఇప్పుడు వర్షం కురిస్తే బురదమయం అవుతున్నది. ద్విచక్రవాహనదారులు కూడా తప్పించుకునే వీలు లేకుండా మొత్తం గోయ్యిగా మారింది. కొద్దిపాటి వర్షం కురిసినా.. రోజులతరబడి నీరు, బురద నిలిచిపోయి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నేడు మంత్రి లోకేశ్ రాక

రేపటి సీఎం చంద్రబాబు పర్యటన రద్దు

విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల ఉత్తరాంధ్ర పర్యటనకుగాను సోమవారం విశాఖ రానున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి 8.30 గంటలకు విశాఖ చేరుకుంటారు. ఇక్కడ నుంచి రోడ్డు మార్గంలో పార్వతీపురం వెళతారు. అక్కడ జరిగే పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవలో పాల్గొంటారు. స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొని రాత్రి పది గంటలకు విశాఖ చేరుకుంటారు. ఇక్కడ టీడీపీ కార్యాలయంలో రాత్రి బస చేస్తారు. పదో తేదీ ఉదయం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి, పితృవియోగం కలిగిన ఆయనను పరామర్శిస్తారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని యోగాంధ్రపై సమీక్ష నిర్వహించి, మధ్యాహ్నం ఒంటిగంటకు విజయవాడ బయలుదేరి వెళతారు.



రేపటి సీఎం పర్యటన రద్దు

విశాఖలో ఈ నెల 10వ తేదీన జరగాల్సిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన రద్దయ్యింది. అయితే ఈ నెల 13న మరో కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం ఇక్కడకు వస్తారని సమాచారం. ఈ పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

నజరానాకు నిరీక్షణ

ఏకగ్రీవ పంచాయతీలకు ఇంతవరకు అందని ప్రోత్సాహక సొమ్ము

- మూడేళ్లపాటు పట్టించుకోని వైసీపీ పాలకులు
- సర్పంచుల హక్కులు కాలరాసేలా చర్యలు
- మరో ఎనిమిది నెలల్లో ముగియనున్న పదవీ కాలం
- కూటమి ప్రభుత్వంపైనే 'ఏకగ్రీవ' సర్పంచుల ఆశలు



చోడవరం మండలంలో ఏకగ్రీవం అయిన జి.జగన్నాథపురం పంచాయతీ

చోడవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగిన పంచాయతీలకు ఇచ్చే ప్రోత్సాహకాలకు గత వైసీపీ ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లకు పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా.. తరువాత మూడేళ్లపాటు అధికారంలో వున్నప్పటికీ ప్రోత్సాహక నిధులు మాత్రం విడుదల చేయలేదు. అధికారంలో వున్న ఐదేళ్లూ గ్రామ పంచాయతీలపై నిర్లక్ష్యధోరణి ప్రదర్శించింది. స్థానిక సంస్థలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసింది. చివరకు కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను కూడా ఖజానాకు మళ్లించుకుంది.

ఎన్నికలు లేకుండా ఏకగ్రీవమయ్యే పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు ఇస్తుంటుంది. ఉమ్మడి జిల్లాలో 969 గ్రామ పంచాయతీలకు 2021 మార్చిలో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ ఇవ్వగా... 86 పంచాయతీల్లో సర్పంచులతోపాటు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీటిలో రెండు వేల జనాభా కంటే తక్కువ వున్న పంచాయతీలు 67 ఉండగా, రెండు నుంచి ఐదు వేల జనాభా వున్న పంచాయతీలు 19 ఉన్నాయి. రెండు వేల జనాభా వరకు వున్న పంచాయతీలకు రూ.ఐదు లక్షలు, రెండు నుంచి ఐదు వేల జనాభా కలిగిన పంచాయతీలకు రూ.10 లక్షలు ప్రోత్సాహకం కింద అందజేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించారు. ఏకగ్రీవం అయిన పంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యుల్లో 90 శాతానికిపైగా వైసీపీ మద్దతుదారులే కావడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షల ప్రోత్సాహకంతో అభివృద్ధి పనులు చేపట్టవచ్చని పంచాయతీల సర్పంచులు భావించారు. ఎన్నికలు జరిగిన సుమారు తొమ్మిది నెలల తరువాత అంటే 2021 డిసెంబరు మూడో వారంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు ... మిగతా 6వ పేజీలో

హెచ్‌ఎంలు, ఎంఈవోలకు డిప్యూటీ డీఈఓలుగా పదోన్నతులు కల్పించాలి

- ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

అనకాపల్లి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి, పాఠశాలలపై పర్యవేక్షణ పెంచడానికి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులకు డిప్యూటీ డీఈఓలుగా వెంటనే పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఏర్పాటు చేసిన క్లస్టర్ హైస్కూళ్ల హెడ్ మాస్టర్ పోస్టులను గ్రేడ్-1 హెచ్‌ఎం పోస్టుగా అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు ఇవ్వాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్ తయారు చేసి పదోన్నతులు చేపట్టాలని, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎం పోస్టు పేరును మార్పు చేయాలన్నారు. దీనిలో ఆర్థిక పరమైన అంశాలతో సంబంధం లేనివి కూడా ఉన్నాయని, ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయులకు పనిభారం తగ్గించాలని, అధికారులు సొంత ... మిగతా 6వ పేజీలో

పల్లా సింహాచలానికి కన్నీటి వీడ్కోలు



- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- స్పీకర్ అయ్యన్నతో సహా పలువురి నివాళి



పల్లా సింహాచలం భౌతికాయంపై పూలమాల ఉంచుతున్న మాజీ ఎంపీ పప్పల చలపతిరావు. పక్కన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలానికి ఆదివారం అధికార లాంఛనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. తొలుత ఆయన పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం కొత్తగాజువాకలోని స్వగృహంలో ఉంచారు. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి నివాళులు అర్పించారు. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, విజయనగరం ఎంపీ ... మిగతా 6వ పేజీలో

సందిగ్ధంలో చెరకు రైతు

... 5వ పేజీ తరువాయి

సాగు మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు.గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో డిస్టిలరీ ఏర్పాటు చేస్తామని కూటమికి చెందిన అనకాపల్లి ఎంపీ, చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు ప్రకటనలు చేస్తున్నారు. అయితే అది ఎప్పటికి సాకారం అవుతుందన్న దానిపై స్పష్టత కొరవడింది. వాస్తవానికి డిస్టిలరీ లేదా ఇథనాల్ ప్లాంట్ ప్రారంభించాలంటే షుగర్ ఫ్యాక్టరీని రన్నింగ్‌లో ఉంచుతూ, చెరకుతోపాటు ఇతర పంటలు పండించేలా రైతులను సమాయత్తం చేయాలి. అధికారులు, పాలకులు ఈ దిశగా చర్యలు చేపడితేనే గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మనుగడ సాధ్యం అవుతుందని రైతులు, కార్మికులు అభిప్రాయ పడుతున్నారు. కానీ ఇప్పటి వరకూ ప్రభుత్వపరంగా, ప్రజాప్రతినిధుల పరంగా యాజమాన్యం నుంచి ఎలాంటి హామీలు రాకపోవడంతో గోవాడ భవితవ్యంపై చెరకు రైతుల్లో నెలకొన్న అనుమానాలకు నివృత్తి లభించదు. ఈ అనిశ్చితికి తెరదించాల్సిన బాధ్యత అధికార పార్టీ ప్రజాప్రతినిధులపైనే వుందని.

నజరానాకు నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

రూ.5.25 కోట్లు విడుదల చేసినట్టు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సంబంధిత గ్రామ పంచాయతీలు ట్రెజరీలో బిల్లులు సమర్పించాయి. తీరా బిల్లులు అప్‌లోడ్ చేసిన తరువాత ఖాతాల్లో తగినన్ని నిధుల లేవు అంటూ సమాచారం వచ్చింది. ఈ విషయమై పలుమార్లు రాష్ట్ర కమిషనరేట్‌కు జిల్లా పంచాయతీ అధికారులు నివేదించినా ఫలితం లేకపోయింది. మరికొద్ది రోజుల్లో ఆర్థిక సంవత్సరం (2021-22) ముగిసిపోవడంతో ప్రోత్సాహకాల కింద విడుదల చేసిన నిధులు మురిగిపోయాయి. ఆ తరువాత సర్పంచులు ఎన్ని పర్యాయాలు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. మరోవైపు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చిన వైసీపీ ప్రభుత్వం.. ప్రజలు ఎన్నుకున్న సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది.

మూడేళ్ల తరువాత గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి, కూటమి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా ఖజానాకు మళ్లించుకోకుండా గ్రామ పంచాయతీలకే కేటాయించింది. దీంతో సర్పంచులు ఎంతో సంతోషించారు. అదే విధంగా ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు కూడా విడుదల చేస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. తమ పదవీ కాలంలో మరో ఎనిమిది నెలలు మాత్రమే వుందని, ఈలోగానే ఏకగ్రీవ ప్రోతాహక నిధులు విడుదల చేస్తే అభివృద్ధి పనులు చేయిస్తామని చెబుతున్నారు

మండలాల వారీగా ఏకగ్రీవం అయిన పంచాయతీల సంఖ్య... ఎలమంచిలి-2, రాంబిల్లి-7, అచ్యుతాపురం-5, మునగపాక-3, మాడుగుల-4, కె.కోటపాడు-5, దేవరాపల్లి-2, చీడికాడ-5, చోడవరం-3, బుచ్చెయ్యపేట-6, కశింకోట-2, రావికమతం-5, నక్కపల్లి-5, గొలుగొండ-3, కోటవురట్ల-4, పాయకరావుపేట-2, రోలుగుంట-1, మాకవరపాలెం-1, ఎస్.రాయవరం-1, జీకేవీధి-3, జి.మాడుగుల-1, కొయ్యూరు-1, పెదబయలు-1, భీమునిపట్నం-3, ఆనందపురం-4, పద్మనాభం-2, పెందుర్తి-1, పరవాడ-1, సబ్బవరం-3.

పల్లా సింహాచలానికి కన్నీటి వీడ్కోలు

... 5వ పేజీ తరువాయి

కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేశ్ బాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధరప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, తదితరులు పల్లా సింహాచలం భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కొత్త గాజువాకలోని శ్మశాన వాటికకు తరలించారు. పెద్ద కుమారుడు శంకరరావు తండ్రి చితికి నిప్పంటించారు. పోలీసులు తుపాకీలతో గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు.

ఏపీఈఏపీ సెట్‌లో 77.92 శాతం ఉత్తీర్ణత

... 5వ పేజీ తరువాయి

332 మంది పరీక్ష రాయగా 286 మంది అర్హత సాధించారు.

భరణికం విద్యార్థికి 381వ ర్యాంకు

పరవాడ: ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో మండలంలోని భరణికం గ్రామానికి చెందిన పెదిశెట్టి శ్రవణ్ 381వ ర్యాంకు సాధించాడు. మొత్తం 160 మార్కులకుగాను ఇతనికి 111 మార్కులు వచ్చా యి. సీఎస్‌ఈలో చేరి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా స్థిరపడాలన్నదే తన లక్ష్యమని శ్రవణ్ వెల్లడించాడు.

వమ్మవరం విద్యార్థికి 525వ ర్యాంకు

ఎస్.రాయవరం: మండలంలోని వమ్మవరం గ్రామానికి చెందిన కర్రి హేమంత్ 525వ ర్యాంకు సాధించాడు. రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యా సంస్థల్లో ఇంటర్ చదివిన ఇతను జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఈడబ్ల్యూఎస్‌లో 950వ ర్యాంకు పొందాడు. కాన్పూర్ ఐఐటీలో సీటు సాధించి, ఇంజనీరింగ్ పూర్తయిన తరువాత సివిల్స్ లక్ష్యమని చెప్పాడు.

'పేట విద్యార్థికి 761వ ర్యాంకు

పాయకరావుపేట: పాయకరావుపేటకు చెందిన జి.సాయి అనీశ్ 761వ ర్యాంకు సాధించాడు. మొత్తం 160 మార్కులనుగాను 102 మార్కులు వచ్చాయి. ఇతను స్థానిక శ్రీప్రకాశ్ విద్యా సంస్థల్లో ఇంటర్ చదివాడు. మంచి పేరున్న ఇంజనీరింగ్ కళాశాలల్లో సీఎస్‌ఈలో చేరతానని చెప్పాడు.

పదోన్నతులు కల్పించాలి

... 5వ పేజీ తరువాయి

అజెండాతో విపరీతమైన ఒత్తిడి పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి లోనై అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ఇతర శాఖల్లో రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన వారు డీఈవోలు, ఆర్‌జేడీలుగా రిటైర్ అవుతున్నారని, కానీ 16 నుంచి 20 సంవత్సరాల సర్వీసు చేసిన హెచ్ఎం, ఎంఈవోలు ప్రమోషన్ లేకుండా రిటైర్ అయిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలమల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే పీఆర్సీ వేసి, ఐఆర్ ప్రకటించాలని, ఉద్యోగులకు డీఏ బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి సీవీవీ సత్యనారాయణ, సహాధ్యక్షుడు వి.నూకరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఏవీహెచ్ శాస్త్రి, కార్యదర్శి ఎంజే రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర ఘనం.. ఆవ అభివృద్ధి శూన్యం

ఆదరణ లేని రాజుల కాలం నాటి కట్టడాలు

కొండకర్ల ఆవ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు

అచ్యుతాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కొండకర్ల ఆవ ప్రాంతాన్ని పాలకులు పట్టించుకోకపోవడంతో చరిత్ర హీనంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాజుల కాలంలో నిర్మించిన కట్టడాలను కూల్చి సచివాలయం నిర్మించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొండకర్ల ఆవ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈప్రాంతాన్ని వైల్డ్ ప్రొటెక్ట్ యాక్ట్-1972 కింద కన్జర్వేషన్ రిజర్వుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఇటీవల ఆవ ప్రాంతాన్ని పర్యటించి, అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా కొండకర్ల ప్రాంతానికి రాజుల కాలం నుంచి ఘన చరిత్ర ఉంది. విజయనగరం రాజుల పరిపాలనలో కొండకర్ల ఫిర్కాగా ఉండేది. రాజులు వేసవిలో ఇక్కడకు మంది మార్బలంతో వచ్చి కొండకర్లలో మకాం వేసేవారు. సుమారు 1,400 ఎకరాల మంచి నీటి సరస్సు (కొండకర్ల), పక్కనే అతిథి గృహం, వంటశాల, గుర్రాల శాల, గుర్రాల కాపరుల వంట శాల నిర్మించారు. వేసవిలో విదేశాల నుంచి పక్షులు కూడా వచ్చేవి. అందువల్ల రాజులు వేసవిలో ఇక్కడకు విడిది చేసేవారు. అనకాపల్లి, చోడవరం, మాడుగుల వరకు రైతుల నుంచి శిస్తులు ఇక్కడే వసూలు చేసేవారు. దీనికోసం అప్పట్లో ఇక్కడ అతిథి గృహాన్ని నిర్మించారు అలాగే వచ్చిన వారికి వండడానికి వంటశాల కూడా ఏర్పాటుచేశారు. రాజుల పాలన అనంతరం బ్రిటీషువారు కూడా ఇక్కడే ఉండి శిస్తులు వసూలు చేశారు. స్వాతంత్ర్యం అనంతరం దీని నిర్వహణ బాధ్యత ఆర్‌అండ్‌బీ అధికారులకు అప్పగించారు. హుద్‌హుద్ తుఫాన్‌లో ఈ గెస్ట్‌హౌస్ తీవ్రంగా దెబ్బతింది. అప్పటి నుంచి దీనిని పట్టించుకోవడం మానేశారు. అలాగే కొండకర్ల గ్రామంలో ఉండే గుర్రాల శాల, వంటశాలలు గత ప్రభుత్వంలో తొలగించి సచివాలయాన్ని నిర్మించేశారు. ప్రస్తుతం గెస్ట్‌హౌస్‌తోపాటు పక్కనే గల వంటశాల మాత్రమే చరిత్రకు ఆనవాళ్లుగా మిగిలాయి. హుద్‌హుద్ తుఫాన్‌కు ముందు ఈ గెస్ట్‌హౌస్‌కి మంచి డిమాండ్ ఉండేది. ప్రతి ఆదివారం ఈ గెస్ట్‌హౌస్ ఖాళీగా ఉండేది కాదు. అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండల పరిధిలోని రాజకీయ నాయకులు గతంలో ఈగెస్ట్‌హౌస్‌లోనే రాజకీయ సమావేశాలు ఏర్పాటుచేసేవారు. అలాగే విలేకర్ల సమావేశాలకు కేరాఫ్ అడ్రస్ కొండకర్ల గెస్ట్‌హౌస్‌గా ఉండేది. అప్పట్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తే వారందకీ ఇక్కడే ఆతిథ్యం. గెస్ట్‌హౌస్‌కి ఇరుపక్కల రెండు కొండలు, ఎదురుగా అతిసుందరమైన కొండకర్ల ఆవ ఉంది.


శిథిలావస్థకు చేరిన కొండకర్ల గెస్ట్‌హౌస్

గెస్ట్‌హౌస్ స్థానే రిసార్టు : ఎమ్మెల్యే విజయకుమార్

కొండకర్లకు పూర్వ వైభవాన్ని తెస్తాం. ప్రస్తుతం పాడుబడిన గెస్ట్ హౌస్ స్థానంలో రిసార్టు నిర్మించాలన్న యోచన ఉంది. ఆవ గర్భంలో ఆక్రమణలకు గురైన ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఆవ గట్లను పటిష్ఠ పరచి మొక్కలు నాటడంతోపాటు పర్యాటకులు విశ్రాంతి తీసుకొనే విధంగా ఏర్పాటుచేస్తాం. సెజ్ కారణంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు అచ్యుతాపురం పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్నారు. వీరందరికి కొండకర్ల ఆవ ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఉండేలా అభివృద్ధి చేస్తాం. అలాగే ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి బస చేయడానికి వీలుగా నిర్మాణాలు కూడా చేస్తాం.


రాజుల కాలంలో నిర్మించిన వంటశాల(ఫైల్)


గుర్రాల కోసం నిర్మించిన హెడ్ (ఫైల్)


వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన సచివాలయం

మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

▸▸ పోలీసులకు కూటమి మహిళా నాయకుల ఫిర్యాదు

పాయకరావుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలపై అసభ్యంగా వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపైనా, దీన్ని ప్రసారం చేసిన చానల్‌పైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు ఎం.రమాకుమారి డిమాండ్ చేశారు. ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు చింతలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు ఆధ్వర్యంలో పలువురు కూటమి నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ అమరావతి రాజధాని ఉద్యమంలో పాల్గొన్న మహిళల పట్ల అసభ్యంగా, శీల హననానికి పాల్పడే విధంగా వ్యాఖ్యలు చేసినవారిలో వీవీఆర్.కృష్ణరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు ముఖ్యపాత్ర వహించారన్నారు. వీరి వ్యాఖ్యలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉండడమే కాకుండా సమాజంలో మహిళల పట్ల చులకన భావనను పెంచేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను కించపరిచిట్టు వ్యాఖ్యలు చేసిన వీవీఆర్.కృష్ణరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపైనా, అదేవిధంగా దీన్ని ప్రసారం చేసిన చానల్‌పైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు బొంది కాశీవిశ్వనాథం, పల్లా విలియంకేరి, జూరెడ్డి ప్రసాద్, ఆది, బోడపాటి శ్రీను, జనసేన పార్టీ నాయకులు నారపురెడ్డి పద్మ, దేవాది మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.


పాయకరావుపేటలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కూటమి నాయకులు

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మునగపాక: రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు అన్నారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశమైన తెలుగు మహిళలు ఒక టీవీ చానల్‌లో అమరావతి మహిళలపై వ్యాఖ్యలు చేసిన వీవీఆర్.కృష్ణరాజు, కొమ్మినేని శ్రీనివాసరావుల తీరును వారు ఖండించారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు కడియం అనూరాధ, పెంటకోట స్వాతి, మాలతి, శాంతి తదితరులు పాల్గొన్నారు.


మునగపాక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

చెత్తతో నిండిన ఊర కాలువ

సాగు నీరందక ఆయకట్టు రైతుల ఇబ్బందులు

పాయకరావుపేట రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాహెబ్‌పేట ఛానల్ పరిధిలోని ఊర కాలువలో చెత్త పేరుకుపోవడంతో కాలువ చివరి ఆయకట్టు భూములకు సాగు నీరు ప్రశ్నార్థకంగా మారింది. ఈ కాలువ కింద 500 ఎకరాలు సాగవుతుంది. ఊర కాలువ సత్యవరం, మాసాహెబ్‌పేట గ్రామాల మధ్యలో నుంచి ప్రవహిస్తుండడంతో కాలువకు ఇరువైపులా ఉన్న ప్రజలు చెత్త, చెదారాన్ని వేసి, డంపింగ్ యార్డుగా మార్చేశారు. చాలా సంవత్సరాలుగా కాలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో సాగునీరు ప్రవహించడం లేదు. గతంలో మాసాహెబ్‌పేటకి చెందిన రైతులు స్వచ్ఛందంగా కాలువలో పూడిక తీసుకునేవారు. అదేవిధంగా ఉపాధి పనులు చేపట్టి కాలువను శుభ్రపరిచేవారు. అయితే చాలా సంవత్సరాలుగా కాలువలో గాజు సీసాలు, ఇనుప ముక్కలు, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను వేస్తుండడంతో రైతులు కాలువలోకి దిగితే గాజు పెంకులతో కాలికి గాయాలవుతాయనే భయంతో పూడిక, తుప్పలను తొలగించడానికి ముందుకు రావడం లేదు. ఉపాధి పనులను కూడా చేపట్టలేదు. ఇప్పటికైనా నాయకులు, సాగునీటి శాఖాధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి ఊర కాలువలో పూడికతీత పనులు చేపట్టి సాగునీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.


సత్యవరం వద్ద ఊరకాలువలో చెత్తా, చెదారం

సమస్యలు పరిష్కరించకుండా పనులు చేపట్టవద్దు

▸▸ ఎస్ఈజడ్ నిర్వాసితులు స్పష్టీకరణ

రాంబిల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించకుండా అధికారులు ఎటువంటి పనులు చేపట్టరాదని మండలంలోని కృష్ణంపాలెం పంచాయతీ ఎస్ఈజడ్ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీఐఐసీ అధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, సిబ్బంది యంత్రాలతో వచ్చి ఎస్ఈజడ్ భూముల్లో పనులు చేపట్టేందుకు సిద్ధపడగా నిర్వాసితులు అడ్డుకున్నారు. ఈ పంచాయతీలో 70 శాతం మేరకు భూములు, ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ గాని, ఇళ్ల స్థలాలు గాని ఇవ్వలేదని, తమ డిమాండ్లను పరిష్కరించిన తర్వాతే పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. అందరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, ఇంటి స్థలాలు ఇవ్వాలని, గ్రామాన్ని తరలించిన తరువాతే పనులు చేయాలని నినాదాలు చేశారు. దీంతో చేసేది లేక అధికారులు వెనుదిరిగారు.


పనులను అడ్డుకున్న కృష్ణంపాలెం ఎస్ఈజడ్ నిర్వాసితులు

ఘనంగా నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రాంబిల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారాయుడుపాలెం (చినపాలెం)లో నిర్మించిన కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. వేద పండితులు అమ్మవారి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. వందలాది భక్తులు ఆలయ ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు ఆచరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయాన్ని విద్యుత్ అలంకరణ, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టరు ధూళి రంగనాయకులు, టీడీపీ నాయకుడు దిన్‌బాబు, ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవిందు, జడ్‌పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, నాయకులు కిషోర్ రాజు, శ్రీనుబాబు, డీవీ సన్న్యయ్య పాల్గొన్నారు.


ప్రతిష్ఠ చేసిన నూకాలమ్మ విగ్రహం

తీరంలో పర్యాటకుల సందడి

ఎస్.రాయవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. మండుతున్న ఎండలకు అల్లాడుతున్న జనం సముద్రతీరం వద్దకు పెద్దఎత్తున తరలివచ్చి సేదతీరారు. పర్యాటకుల తాకిడితో సముద్రతీర పరిసర ప్రాంతాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. తీరం వద్ద ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అక్కడ మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు.


రేవుపోలవరం సముద్రతీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

జనసేనకు పెరుగుతున్న ఆదరణ : సుందరపు

మునగపాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకు ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నందునే పార్టీలో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం అచ్యుతాపురంలో ఎమ్మెల్యే స్వగృహంలో మండలం లోని వెంకటాపురం గ్రామానికి చెందిన 50 మంది ఎమ్మెల్యే సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోని ఎమ్మెల్యే విజయకుమార్ సాదరంగా ఆహ్వానించారు. వీరమహిళ సుందరపు ధనలక్ష్మి సారథ్యంలో వారంతా జనసేన తీర్థం పుచ్చుకున్నారు.


ఎమ్మెల్యే సమక్షంలో జనసేనలో చేరిన వెంకటాపురం గ్రామస్థులు

ఎన్ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

నక్కపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం, ఉద్దండపురం జడ్పీ హైస్కూళ్లకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్టు ఎంఈవో కె.నరేశ్, ఆ పాఠశాలల హెచ్ఎంలు కె.జయశ్రీ, కె.నాగన్నదొర ఆదివారం తెలిపారు. పెదబోదిగల్లంలో 2024-25 విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదివిన యాదాల చరణ్, ఉద్దండపురం హైస్కూల్‌కు చెందిన కొండ్ర సతీశ్ ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

చిన్నారులకు సెల్‌ఫోన్లు దూరంగా ఉంచాలి

▸▸ బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి


చిన్నారికి కంటి అద్దాలు పెడుతున్న దొరస్వామి

అచ్యుతాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు సెల్‌ఫోన్లు దూరంగా ఉంచాలని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి అన్నారు. ఆదివారం బ్రాండిక్స్‌లో నిర్వహించిన 139వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి సెల్‌ఫోన్ అలవాడు చేయడం వల్ల వీరి కంటి చూపు దెబ్బతింటోందన్నారు ఏడువందల మంది కంటి రోగులు హాజరుకాగా.. 530 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 330 మందికి ఉచితంగా కంటి అద్దాలు, 156 మందికి మందులు పంపిణీ చేశారు. 44 మందికి కంటికి శస్త్రచికిత్సలు చేయాలని వైద్యులు నిర్ధారించారు. వీరికి విశాఖలోని శంకర్ ఫౌండేషన్‌లో శస్త్రచికిత్సలు చేయిస్తామని దొరస్వామి తెలిపారు. శిబిరానికి హాజరైన వారికి మజ్జిగ, పులిహోర,మధ్యాహ్నభోజనం అందించారు.

పురాతన బంగ్లా పునర్నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు

మునగపాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవర్ల అనకాపల్లిలో పురాతన బంగ్లా పునఃనిర్మాణానికి రూ.10 లక్షలు జడ్పీ నిధులు మంజూరయ్యాయని టీడీపీ సీనియర్ నాయకుడు పొలమరశెట్టి మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం పునఃనిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బంగ్లా శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే విజయకుమార్ దృష్టికి తీసుకు వెళ్లామని, ఆయన నిధులు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి మంగవేణి,కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, చదరం భాస్కరరావు, ఆళ్ల వెంకటేశ్వర్లు, పి.నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

నాగవరంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మునగపాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగవరంలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్నవారిలో బొడ్డేడ ప్రసాద్, దాసరి అప్పారావు ఉన్నారు.

'ప్రతి పంచాయతీలో మొక్కలు నాటాలి'


హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న బీజేపీ నేతలు

రాంబిల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీలో మొక్కలు నాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు కారే రాముడు అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్‌మోర్చ నాయకులు ధర్మాల గోవిందరెడ్డి, కార్యదర్శి ఎస్. తేజ, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు కొవిరి వెంకటేశ్వరులు, నేతలు ఎరిపల్లి సోమేశ్వరరావు, దాలమ్మదేవి, సిగిరెడ్డి వెంకట సూర్యసన్యాసినాయుడు, లంకా భాస్కరరావు, చింతకాయల గగన్, సీహెచ్ రమణ, ఎస్.నూకరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కొత్తూరు దనదిబ్బలు వద్ద యోగాంధ్ర

రాంబిల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు బౌద్ధక్షేత్రం ఆవరణలోని దనదిబ్బలు వద్ద ఈనెల 9న జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 5:30 గంటలకు సుమారు 3 వేలు మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యకమానికి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హాజరవుతున్నారు.

నేడు పట్టణంలో యోగాపై అవగాహన ర్యాలీ

ఎలమంచిలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. మునిసిపల్ కార్యాలయం నుంచి ప్రధాన రోడ్డు మార్గాల మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకూ యోగా గురించి అవగాహన కల్పిస్తామని, అనంతరం మానవహారం నిర్వహిస్తామన్నారు.

ప్రతిభా పురస్కారాలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

నక్కపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గత మార్చి నెలలో నిర్వహించిన టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలానికి చెందిన ఆరుగురు బాల,బాలికలు ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్టు ఎంఈవో కె.నరేశ్ చెప్పారు. వేంపాడు హైస్కూల్‌లో చదివిన కొయ్య విద్యాసాగర్ (588), పోతంశెట్టి గన్నెమ్మ (577), స్థానిక గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన బొడ్డు నాగస్వాతి (577), మామిడి గాయత్రి (576), గురు హైస్కూల్‌లో చదివిన బద్ది జయ కృష్ణవంశీ (571), గురుకుల పాఠశాలకు చెందిన చీడిపల్లి వైష్ణవి కీర్తి (514) మార్కులు సాధించి ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్టు చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.20వేలు నగదుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేస్తారని చెప్పారు. ఈనెల 9న అనకాపల్లిలో తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తారన్నారు.

ఘనంగా ఉలివిందులమ్మ జాతర

ఎస్.రాయవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగొల్లు సమీపంలో ఉలివిందులమ్మ జాతరను ఆదివారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్థానికులతోపాటు వమ్మవరం గ్రామ మహిళలు పెద్దఎత్తున ఆలయానికి తరలివెళ్లి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. సాయంత్రం ఉలివిందులమ్మ ఊరేగింపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుగొల్లు, వమ్మవరం గ్రామాల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

'యాంత్రీకరణతో కూలీల కొరత అధిగమించవచ్చు'

కోటవురట్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వరిలో యాంత్రీకరణతో కూలీల కొరతను అధిగమించవచ్చునని బీసీటీ కృషి విజ్ఞాన్ శాస్త్రవేత వి.ప్రసాద్ అన్నారు. ఆదివారం బోడపాలెం, సుంకపూర్ గ్రామాలలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరిలో విత్తనాలు, ఎరువు గొర్రుతో ఎదపెట్టడం వలన సాగుకయ్యే ఖర్చు తగ్గుతుందని, కూలీల కొరతను అధిగమించవచ్చునన్నారు. ఏవో సరోజని మాట్లాడుతూ వరి నూతన రకాల ఎంటీయూ 1224, ఎంటీయు 1262, ఎంటీయు 1318 వంగడాలతో సాగుచేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బీసీటీ కృషి విజ్ఞాన్ శాస్త్రవేత శ్రీకాంత్‌గౌడ్, గ్రామసర్పంచ్ చిటికెల కాశీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి

▸ వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి రాక ▸ క్యూ లైన్లు కిటకిట

▸ బాలాలయంలో అమ్మవారికి పూజల అనంతరం దర్శనాలు


బాలాలయంలోని అమ్మవారు

అనకాపల్లి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అన కాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాం తాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది. తెల్లవారుజామున అర్చకులు బాలాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. క్యూ లైన్లు నిండిపోయాయి. కుటుంబాలతో విచ్చేసినవారు ఆలయం ఆవరణతో పాటు చుట్టు పక్కల తోటల్లో వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. భక్తులకు ఎటువంటి అసౌర్యం కలగకుండా ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, సభ్యులు చర్యలు చేపట్టారు. పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించగా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఇదిలావుంటే, అమ్మవారిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ దర్శించుకున్నారు.


అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ


పురవీధుల్లో కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

తుమ్మపాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం తుమ్మపాల అంబేడ్కర్ కాలనీలో ఆదివారం నాగదేవత విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. తొలుత అమ్మవారి విగ్రహంతో పాటు కలశాలు, సారెను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయం వద్ద కోలాటాలు, డప్పు వాయిద్యాలు, మేళ తాళాలతో కోలాహల వాతావరణం నెలకొంది. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటైంది. గ్రామ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : సీఐ


పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కనాటుతున్న సీఐ రామచంద్రరావు

సబ్బవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఐ జి.రామచంద్రరావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా సబ్బవరం పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. పుట్టిన రోజు, పెళ్లిరోజు ఇలా శుభకార్యం ఏదైనా గుర్తుగా నిలిచేందుకు యువతీ యువకులు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని కోరారు. గ్రామీణులను ఈ విషయంలో చైతన్యవంతులను చేయాలన్నారు. ఎస్ఐ దివ్య, జి.స్మామాట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కొత్తూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు ఈ నెల 22న నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో జరగనున్నాయని అనకాపల్లి బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్నెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరపల్లి కృష్ణాజీ, శిలపర శెట్టి బాబి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. ఔత్సాహిక క్రీడాకారులు జిల్లా నుంచి హాజరు కావాల్సిందిగా వారు కోరారు. విజేతలకు ప్రతి కేటగిరీలో క్యాష్ అవార్డుతో పాటు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చిన్ని, కరణం చినబాబు, కె.నరేంద్ర, ఎం.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ గ్రామంగా సోమవరం

▸ ఎమ్మెల్యే 'కొణతాల' వెల్లడి ▸ సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు 10, 11 తేదీల్లో పల్లె నిద్ర ▸ అభివృద్ధి పనులపై సమగ్ర చర్చ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కశింకోట మండలం సోమవరం గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసినట్టు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వెల్లడిం చారు. అనకాపల్లిలోని జనసేన కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై కూటమి నాయకులతో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు సదరు గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 10, 11 తేదీల్లో గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం చేపడతామని చెప్పారు. అధికారులతో కలిసి ఈ రెండు రోజులు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అభివృద్ధిపై చర్చిస్తామన్నారు. ఉదయం యోగాభ్యాసంతో కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. ప్రకృతి వైద్యం, మానవ జీవన ఆహారపు అలవాట్లపై గంట పాటు సదస్సు నిర్వహించనున్నామని వివరించారు. అంతేకాకుండా గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు, యువతకు క్రీడలు, మహిళలకు ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి వాటిని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తగిన ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

యోగా జీవితంలో భాగం కావాలి

▸ 'యోగాంధ్ర'లో జిల్లా ఆయుష్ అధికారిణి డాక్టర్ లావణ్య


జార్జి క్లబ్‌లో ఆసనాలు వేస్తున్న వృద్ధులు


యోగాంధ్రలో మాట్లాడుతున్న ఆయుష్ అధికారిణి డాక్టర్ లావణ్య

అనకాపల్లి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని జిల్లా ఆయుష్ అధికారిణి డాక్టర్ కె.లావణ్య అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం జార్జిక్లబ్‌లో యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వయో వృద్ధులు యోగాసనాలు వేయడం వల్ల వారి ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. అనంతరం యోగా గురువులు మంగియ్య, దొరమ్మనాయుడు, బి.అప్పారావులు పలు ఆసనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వయో వృద్ధుల సంఘం జిల్లా అధ్యక్షులు గౌరీపతితో పాటు పెద్ద ఎత్తున వయో వృద్ధులు పాల్గొన్నారు.

'పిసినికాడ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి'


గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకీ

కొత్తూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని పిసినికాడ గ్రామాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నిరంగాల్లో అభివృద్ధి చేయనున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) అన్నారు. ఆదివారం ఆయన గ్రామంలో సమావేశాన్ని నిర్వహించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామస్థులతో చర్చించారు. సరైన రోడ్లు, కాలువలు వంటివి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అక్కడివారు వివరించారు. వర్షం వస్తే రోడ్లపైనే నీరు ప్రవహిస్తోందన్నారు. వీటితో పాటు మరిన్ని సమస్యలపై ఏకరువుపెట్టారు. వీటిపై రాంకీ స్పందిస్తూ ఈ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు చెప్పారు. నూకాంబిక ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), నాయకులు మళ్ల రాంబాబు, శ్రీను, దాడి లక్ష్మణరావు, అప్పారావు, రాము, బాల, ఆడారి శ్రీను, సాయి, రాజగిరి కోటి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విజయనగరం జోన్‌లో
సమ్మెకు ఎన్‌ఎంయూఏ తీర్మానం

▸ అనకాపల్లిలో రిలే నిరాహార దీక్షలను విరమింపజేసిన నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు

అనకాపల్లి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు వందవ రోజుకు చేరుకున్న సందర్భంగా ఆదివారం ఆర్టీసీ ఎన్ఎంయూఏ జోనల్ విస్తృతస్థాయి సమావేశాన్నిఅనకాపల్లిలో నిర్వహించారు. తొలుత జోన్ నాయకులు రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం సమావేశంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు మాట్లాడుతూ జోన్‌లో 1/2019 సర్క్యులర్ యాజమాన్యం అమలు చేయని కారణంగా జోనల్ స్థాయిలో సమ్మె చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. ఇందులో భాగంగా జోన్‌లో ఉన్న ఆరు రీజనల్ కమిటీలు ఈ నెల 11వ తేదీన జిల్లా కలెక్టర్లకు సమ్మె నోటీస్ ఇవ్వాలని ప్రతిపాదించగా, సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనకాపల్లి జిల్లా పరంగా యాజమాన్యానికి సమ్మె నోటీస్ ఇస్తున్న కారణంగా రిలే నిరాహార దీక్షలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, నాయకులు విరమింపజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, రీజనల్ కార్యదర్శి శంకరరావు, జోనల్ కార్యదర్శి రాములు, రాష్ట్ర నాయకులు నరసింగరావు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, రాఫిల్, ఎంవీఆర్ మూర్తి, నాగరాజు, సూర్యం, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం
పట్టణ నూతన కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న మళ్ల సురేంద్ర తదితరులు

అనకాపల్లి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం నిదానందొడ్డి కామాక్షిదేవి కల్యాణ మండపంలో ఆదివారం అనకాపల్లి విశ్వబ్రాహ్మణ సంఘ సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా పట్టణ శాఖ నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ నూతన అధ్యక్షుడిగా పొన్నాడ వెంకట సత్య నరసింహాచారి (పెదబాబు), ప్రధాన కార్యదర్శిగా యండపల్లి మోహన్ బ్రహ్మాజీ, కోశాధికారిగా కిల్లాడ శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులుగా బి.వెంకటరావు, కోసూరి మన్మథరావు, కొమ్మోజు రామకృష్ణ, కాకినాడ శ్రీనులతో పాటు 25 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరితో ముఖ్య అతిథిగా హాజరైన విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గోడి నరసింహాచారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సంఘంలోని సభ్యుల సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, రాష్ట్ర బంగారం వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల రాజేంద్ర, మాజీ కార్పొరేటర్ బి.ఉమామహేశ్వరరావు, పట్టణ కార్పెంటర్స్ అసోసియేషన్, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

నాయుళ్ల వీధిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతి


జిమ్ సమీపంలో వృద్ధుడి మృతదేహం

అనకాపల్లి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాయుళ్ల వీధిలో గల జిమ్ సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ సమాచారాన్ని స్థానికులు ఆదివారం ఉదయం పోలీసుకు అందించడంతో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడి వయస్సు 65 సంవత్సరాలు ఉంటాయని అంచనాగా తెలిపారు. ఇతడు ఎవరు, ఎక్కడివాడు తదితర వివరాలేవీ లభించలేదన్నారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చురీలో భద్రపరుస్తామన్నారు. ఆచూకీ తెలిసినవారు అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

12 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కొత్తూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మాకవరం గ్రామంలో ఆదివారం మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో మాకవరంలో మాటు వేయగా 12 మద్యం క్వార్టర్ బాటిళ్లను గోనె సంచిలో పట్టుకుని వస్తున్న ఈళ్ల గంగారావును గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్ డాక్టర్ డీడీ నాయుడుకు సత్కారం


డాక్టర్ నాయుడును సత్కరిస్తున్న వాకర్స్

అనకాపల్లి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్ వాసవీక్లబ్ ప్రతినిధులు డాక్టర్ డీడీ నాయుడును వేర్వేరుగా సత్కరించారు. ఇతను ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వాసవీ క్లబ్ ప్రతినిధులు రాపేటి నారాయణరావు, కె.ద్వారకానాథ్, ఆర్ఎస్ఎస్ మహేశ్వరరావు, డి.లక్ష్మణరావు, వాకర్స్ సంఘం ప్రతినిధులు సత్కరించారు.

భగవద్గీత, జ్ఞాన గ్రంథాలపై ప్రచారం


భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

కశింకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కశింకోటలో భగవద్గీత, జ్ఞాన గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సదరు సభ్యులు ఇంటింటికీ వెళ్లి భగవద్గీతలోని ప్రధాన అంశాలను వివరించారు. భగవద్గీత శాశ్వతమైన దైవ మతమని, దైవ మార్గమని ప్రతి ఒక్కరూ గ్రహించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు రాజారావు, రమణ, పద్మ, నాగమణి, దేవి, సర్వదారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మూడో విడత చందనం అరగదీత పూర్తి

సింహాచలం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామికి మూడో విడత చందన సమర్పణకు అవసరమైన చందనం అరగదీత ఆదివారంతో ముగిసింది. ఈనెల 6న అప్పన్నస్వామికి ప్రత్యేక పూజల అనంతరం మూడో విడత చందనం అరగదీతకు శ్రీకారం చుట్టారు. మూడు రోజుల పాటు ఆలయ నాల్గవ తరగతి సిబ్బంది 16 మంది శ్రమించి తొలిరోజు 34 కిలోలు, రెండవ రోజు 49 కిలోలు చందనాన్ని అరగదీశారు. మూడవ రోజైన 50 కిలోలు చందనాన్ని అరగదీశారు. ఈనెల 11వ తేదీ నాటి జేష్టపౌర్ణమి నాడు అప్పన్నస్వామికి సమర్పించనున్నారు.

సత్యనారాయణస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ


ధ్వజస్తంభం ప్రతిష్ఠలో రామకృష్ణ, తదితరులు

కొత్తూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపురంని హేమగిరి కొండపై కొలువుదీరిన రమా సమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ , టీడీపీ నాయకుడు పీలా శ్రీకాంత్ హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ అప్పికొండ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జమాదులపాలెం రోడ్డుపై గుంతలు పూడ్చివేత


గుంతల పూడ్చివేత పనులు జరుగుతున్న దృశ్యం

కశింకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జమాదులపాలెం రోడ్డుపై పడిన గుంత లను గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కుమారుడు కరక సాయికుమార్ ఆదివారం పూడ్చివేయించారు. వర్షా కాలంలో రోడ్డుపై పడిన గుంతల కారణంగా జనం ఎదుర్కొంటున్న ఇబ్బందులనుగుర్తించిన ఆయన ఈ మేరకు ముందుకు వచ్చారు. ప్రధానంగా గుంతల్లో నీరు చేరుతుండడంతో రోడ్డు ఎక్కడో, గుంతలు ఎక్కడో వాహనచోదకులు గుర్తించలేక ప్రమాదాలకు గురయ్యేవారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తమ సొంత నిధులు వెచ్చించి గుంతలను పూడ్చివేయించారు. రావిచెట్టు మొదలుకొని పాఠశాలకు వెళ్లే వరకు రహదారిపై పడిన గుంతలను రెడీమిక్స్‌తో పూడ్చివేయించారు. దీంతో పలువురు గ్రామస్థులు అతనిని అభినందించారు.

పైప్‌లైన్‌కు రంధ్రంతో తాగునీరు వృథా

▸ ప్రాథమిక పాఠశాల సమీపంలో సమస్య ▸ పట్టించుకునేవారు లేక పలువురు ఆగ్రహం


రహదారి అడుగు భాగాన పైప్‌లైన్‌కు రంధ్రంతో వృథాగా పోతున్న నీరు

పరవాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ప్రధాన మార్గంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో తాగునీరు వృథాగా పోతోంది. పంచాయతీకి చెందిన రక్షిత మంచినీటి పైప్‌లైన్‌కు రహదారి అడుగు భాగంలో రంధ్రం ఏర్పడడంతో ఈ పరిస్థితి నెలకొంది. గత కొన్ని రోజులుగా ఇక్కడ ఈ సమస్య ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో పెద్ద ఎత్తున నీరు రహదారి పొడవునా పారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీరు వృథాను అరికట్టాలని గ్రామస్థులంతా కోరుతున్నారు.

ఎంఆర్‌సీలో ఎస్జీటీ బదిలీల వెబ్ ఆప్షన్ సేవలు



ఎంఆర్‌సీలో ఎస్‌జీటీల బదిలీలకు వెబ్ ఆప్షన్లు పెడుతున్న ఉపాధ్యాయులు, ఎంఈవో ప్రసాద్

చింతపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల రిసోర్సు సెంటర్ (ఎంఆర్‌సీ)లో సెకండరీ గ్రేడ్ టీచర్ బదిలీల వెబ్ ఆప్షన్ సేవలు అందుబాటులో ఉన్నట్టు స్థానిక మండల విద్యాశాఖ అధికారి పీబీవీవీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎంఆర్‌సీలో ఎస్‌జీటీలకు వెబ్ ఆప్షన్‌ల నమోదుకు అనువుగా ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్‌జీటీల బదిలీలు ఆన్‌లైన్ విధానంలో చేపడుతుందన్నారు. ఈమేరకు ఉపాధ్యాయులు ఆప్షన్‌లు పెట్టుకోవాలన్నారు. స్థానిక ఎంఆర్‌సీలో వెబ్ ఆప్షన్‌లో పాఠశాలలను ఎంపిక చేసుకునేందుకూ సోమవారం సాయంత్రం వరకు ఈసేవలు అందుబాటులో ఉంటాయని ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు పాల్గొన్నారు.

బావిలో మృతి చెందిన కుక్క... తాగునీరు కలుషితం

» పలువురికి స్వల్ప అస్వస్థత



పుల్లమామిడిలో బావిని పరిశీలిస్తున్న ఏఈఈ స్వర్ణలత, సర్పంచ్ లలిత

చింతపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పుల్లమామిడి గ్రామంలో బావిలో కుక్కపడి పలువురికి స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు. విషయంతెలుసుకున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ గడుతూరి స్వర్ణలత, స్థానిక సర్పంచ్ లలితతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ఆదివాసీలు తాగేందుకు వినియోగిస్తున్న బావిని పరిశీలించారు. పుల్లమామిడిలో ఆదివాసీలు తాగేందుకు వినియోగించే బావిలో మృతి చెందిన కుక్కను గుర్తు తెలియని వ్యక్తులు రెండు రోజుల క్రితం పడేసినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఏఈఈ మాట్లాడుతూ, గ్రామంలో రక్షిత మంచి నీటి పథకం నిర్మించి ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు.ప్రస్తుతం పొరుగునున్న పెండ్లిమామిడి నుంచి పైపుల ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు. అలాగే గ్రామంలో జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. అస్వస్థల పాలైన వారికి వైద్య సేవలందించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

అనకాపల్లి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాయుళ్లవీధిలో గల జిమ్ సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ సమాచారాన్ని స్థానికులు ఆదివారం ఉదయం పోలీసుకు అందించడంతో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మృతుడి వయస్సు 65 సంవత్సరాలు ఉంటాయని అంచనాగా తెలిపారు. ఇతడు ఎవరు, ఎక్కడివాడుతదితరవిరాలేవీ లభించలేదన్నారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చురీలో భద్రపరుస్తామన్నారు. ఆచూకీ తెలిసినవారు అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

చింతపల్లి ఈవోఆర్‌డీ పీఆర్‌కు బదిలీ

చింతపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ ఈవోఆర్‌డీ పీఆర్ యూఎస్‌వీ శ్రీనివాసరావు అచ్యుతాపురం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మాకవరపాలెం మండల పరిషత్‌లో విధులు నిర్వహిస్తున్న సీతామహాలక్ష్మిని ఇక్కడ నియమించారు. చింతపల్లి ఎంపీడీవో ఆశాజ్యోతి సెలవుపై వెళ్లడంతో ఆరు నెలలుగా ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే, ఎంపీడీవో దీర్ఘకాల సెలవులో ఉండడంతో శ్రీనివాసరావు ఎంపీడీవోగా కొనసాగే అవకాశంవున్నది.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ముంచంగిపుట్టు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులతో పలు రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, వాటి బారిన పడకుంగా ప్రతీ ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. వ్యాధులు అదుపు చేసేందుకు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎటువంటి అనారోగ్య సమస్య తలెత్తినా వైద్యులను సంప్రదించాలని ఆయన కోరారు. ఎండలోకి వెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు.

అతివేగం ప్రమాదకరం: ఎస్‌ఐ

ముంచంగిపుట్టు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వాహనాలను అతివేగంగా నడడం ప్రమాదకరమని స్థానిక ఎస్‌ఐ జె.రామకృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాహన తనిఖీలను నిర్వహించారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రైవేటు వాహనాల్లో ప్రయాణికులను స్థాయికి మించి ఎక్కించరాదని, నిబంధనలను వాహన చోదకులు విధిగా పాటించాలని సూచించారు. అలాగే చిన్న పిల్లలకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను ఇవ్వరాదని సూచించారు.



కొయ్యూరులో ఇరుకుగదిలో కొనసాగుతున్న ఎంఈవో కార్యాలయం



గడిలో తడిసిన సామగ్రి, పుస్తకాలు

విద్యాశాఖ కార్యాలయానికి వసతి కరవు

» శిథిలమైన మండల పరిషత్ కార్యాలయంలో కార్యకలాపాలు

» వర్షం కురిస్తే లోనికి నీరు.. తడసిపోతున్న సామగ్రి

కొయ్యూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయానికి వసతి లేక తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దశాబ్దాలుగా మండల పరిషత్ కార్యాలయంలోని ఓ గదిలోనే ఎంఈవో కార్యాలయ కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఏటా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పుస్తకాలు, అకడమిక్ ఇయర్ మధ్యలో పాఠశాలలకు కంప్యూట ర్లు, టీవీలు, తదితర సామగ్రి సరఫరా అవుతోంది. వీటిని పాఠశాలలకు పంపిణీ చేసేవరకు భద్రపరిచేందుకు చోటులేక స్థానిక ఎంఈవోలు తీవ్ర అవసలు ఎదుర్కొంటున్నారు. అయితే మండలాలకు విభజనకు పూర్వం సమితి ఏర్పాటు సమయంలో నిర్మించిన ఈ భవనంలో నేటికీ ఎంఈవో కార్యాలయం కొనసాగుతోంది. ఈ భవనం పూర్తిగా శిథిల స్థితికి చేరింది. శ్లాబ్ బీటలు వారి పెచ్చులు ఊడి పడుతుండటంతో గత ఆరేళ్ల కిందట అప్పటి తెలుగుదేశం పార్టీ హయాంలో మండల పరిషత్ కార్యాలయ నిర్వహణకు గానూ భవన నిర్మాణాలకు కోటి రూపాయిలు మంజూరయ్యాయి. నాలుగేళ్ల క్రితం ఈ భవనం నిర్మాణం పూర్తయింది. దీంతో మండల పరిషత్ కార్యాలయంను ఈ నూతన భవనంలోకి మార్చారు. కానీ మండల విద్యాశాఖ కార్యాలయ నిర్వహణకు అందులో గది కేటాయించలేదు. దీంతో విధి లేక శిథిల భవనం గదిలోనే ఎంఈవో కార్యాలయం ప్రస్తుతమూ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. శ్లాబ్ గోడలు బీటలు బారి ఏ క్షణాన కూలి ఏ అవాంఛనీయ సంఘటన చోటు చేసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. అయినా, తప్పని స్థితిలో ఎంఈవో కార్యాలయ సిబ్బంది ప్రాణాలు పిడికట్లో పెట్టుకుని ఈ శిథిల భవనంలోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.



వర్షాలకు తడిసి ముద్దయిన పాఠ్యపుస్తకాలు

ఎంఈవో కార్యాలయ పరిస్థితిపై గత ప్రభుత్వ హయాంలో ఎంఈవోలు పలు దఫాలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా ఫలితంలేకపోయింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ హయాంలో మండల విద్యాశాఖ కార్యాలయ నిర్వహణకు వీలుగా సొంత గూడు కల్పించేలా నిధులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

కంప్యూటర్లు, ఫైల్స్ తడిసిపోతున్నాయి



కార్యాలయ నిర్వహణకు, ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేసే సామగ్రి భద్ర పరిచేందుకు తగిన వసతి లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రస్తుతం కార్యాలయం నిర్వహిస్తున్న భవనం కారి పోతుండటంతో కంప్యూర్లు, ఫైళ్లు పూర్తిగా తడిసి ముద్దవుతున్నాయి. ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో ఉన్న భవనంలోనే విధులు నిర్వహించక తప్పటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం సొంత భవనం నిర్మాణాలకు వీలుగా చర్యలు చేపడితే బాగుంటుంది.

- ఎంఈవోలు రాంబాబు, నాగభూషణం

మోదకొండమ్మ ఆలయంలో రద్దీ

పాడేరురూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాలతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి ఆలయం రద్దీ నెలకొంది. అమ్మవారి పండగ సమయంలో రాలేని భక్తులకు అధిక సంఖ్యలో వచ్చారు. అమ్మవారికి ఘటాలను సమర్పించి ప్రత్యేక పూజలను చేపట్టి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి పండగను ఆనందంగా జరుపుకున్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందించారు. ఆలయ, ప్రసాద కమిటీ ప్రతినిధులు బి.వెంకటరమణ, సీహెచ్.రామకృష్ణ, దన్నేటిపలాసి రాము, జి.శంకరరావు, టి.ఈశ్వరరావు, కె.వెంకటరమణ పాల్గొన్నారు. పాడేరుఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల మోదకొండమ్మ పాదాలకు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.



ఆరుబయట వంటలు చేస్తున్న దృశ్యం



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఆడిటోరియం అందుబాటులో లేక భక్తుల అవస్థలు

మోదకొండమ్మ దర్శనానికి వచ్చి మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చే మైదాన ప్రాంత భక్తులకు వంటలు చేసుకొనేందుకు వీలుగా అమ్మవారి సన్నిధిలోని ఆడిటోరియంను ఆదివారం, మంగళవారం అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు. ఆదివారం సబ్బవరం మండలం గొలగాం గ్రామం నుంచి వందలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకొని పండగ నిర్వహించేందుకు వచ్చారు. అయితే ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆడిటోరియం ప్రాంగణాన్ని ఆలయ కమిటీ ముందుగానే మరో వేడుక నిర్వాహకులకు అద్దెకు ఇవ్వడంతో వారు ఇబ్బందులకు గురయ్యారు. చేసేదిలేక పక్కనే ఉన్న అమ్మవారి కళావేదిక వద్ద మండుటెండలో వంటలు చేయాల్సి వచ్చింది. ఆలయ ఆదాయం కోసం ఆడిటోరియంను భక్తులు రాని రోజుల్లో అద్దెకి ఇస్తే పర్వాలేదు. ఈస్థితిలో భక్తులు వచ్చే ఆది, మంగళవారాల్లో భక్తులకు అందుబాటులో ఉంచేందుకు ఆలయ కమిటీ కృషి చేయాలని కోరారు.

అక్రమ కట్టడాలు స్వచ్ఛందంగా తొలగింపు



జీకేవీధిలో కట్టడాలను తొలగిస్తున్న వర్తకులు

గూడెంకొత్తవీధి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మించిన కట్టడాలను వర్తకులు స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు రెండు రోజుల క్రితం మండల కేంద్రంలో రహదారికి ఇరువైపులా 13-17 మీటర్ల విస్తీర్ణంలో నిర్మించుకున్న కట్టడాలను తొలగించుకోవాలని రెవెన్యూ అధికారులు కొలతలు వేసి మార్కింగ్ చేశారు. అయితే స్థానిక వర్తకులు రెవెన్యూ అధికారులు ఇచ్చిన కొలతలు ప్రకారం దుకాణాలు తొట్టడాలు తొలగించుకుంటే తమ జీవనోపాధి పోతుందని విజ్ఞప్తి చేశారు. దీంతో రహదారి నుంచి ఐదు ఐడుగుల వరకు నిర్మించిన కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. దీంతో ఆదివారం రహదారి నుంచి ఐదు అడుగుల వరకు నిర్మించిన కట్టడాలను స్వచ్ఛందంగా వర్తకులు తొలగించుకునే పనులను ప్రారంభించారు.

ఆర్టీసీ విజయనగరం జోన్‌లో సమ్మెకు ఎన్ఎంయూఏ తీర్మానం

» అనకాపల్లిలో రిలే నిరాహార దీక్షలను విరమింపజేసిన నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు

అనకాపల్లి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు వందవ రోజుకు చేరుకున్న సందర్భంగా ఆదివారం ఆర్టీసీ ఎన్ఎంయూఏ జోనల్ విస్తృతస్థాయి సమావేశాన్నిఅనకాపల్లిలో నిర్వహించారు. తొలుత జోన్ నాయకులు రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం సమావేశంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు మాట్లాడుతూ జోన్‌లో 1/2019 సర్క్యులర్ యాజమాన్యం అమలు చేయని కారణంగా జోనల్ స్థాయిలో సమ్మె చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. ఇందులో భాగంగా జోన్‌లో ఉన్న ఆరు రీజనల్ కమిటీలు ఈ నెల 11వ తేదీన జిల్లా కలెక్టర్‌లకు సమ్మె నోటీస్ ఇవ్వాలని ప్రతిపాదించగా, సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనకాపల్లి జిల్లా పరంగా యాజమాన్యానికి సమ్మె నోటీస్ ఇస్తున్న కారణంగా రిలే నిరాహార దీక్షలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, నాయకులు విరమింపజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, రీజనల్ కార్యదర్శి శంకరరావు, జోనల్ కార్యదర్శి రాములు, రాష్ట్ర నాయకులు నరసింగరావు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, రాఫిల్, ఎంవీఆర్ మూర్తి, నాగరాజు, సూర్యం, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు కాని ధర

» గిరిజనులు ఆందోళన

హుకుంపేట జూన్ 8 (ఆంధ్రజ్యోతి); అటవీ ఉత్పత్తుల ధరలు ఈ ఏడాది పడిపోవడంతో గిరిజన రైతులు ఆవేదన వక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రతి శనివారం జరిగే స్థానిక వారపు సంతకు మండలంలోని వివిధ గ్రామాలనుంచి అడాకులు తెచ్చి విక్రయిస్తుంటారు. గత కొన్ని వారాలుగా ధర రాకపోవంతో నిరాశ చెందుతున్నారు. గత ఏడాది కావిడి అకులకు రూ. 2వేలకు పైగా ధర పలకగా, ఈ సీజన్‌లో అదే కావిడి అకులకు రూ. 1200 నుంచి రూ. 1500 పలుకుతున్నట్టు రైతులు చెప్పారు. అలాగే, కొండచీపురుకట్ట గత ఏడాది రూ. 50 నుంచి రూ.70 ధర వచ్చింది. ఈ సారి రూ. 25నుంచి రూ. 30కే చీపుకట్ట కొనుగోలు చేస్తున్నట్టు గిరిజనులు ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజన సహకార సంస్థ చింతపండు, కాఫీ కొనుగోలు చేసినట్లే. ఈ సీజన్‌లో రైతు పండించిన పంట దినుసులను సేకరించాలని రైతులు కోరుతున్నారు. దళారులు, వ్యాపారులు బెడద లేకుండా చూడాలని అభ్యర్థించారు.



అమ్మకానికి తీసుకువచ్చిన కొండచీపుర్లు



హుకుంపేట సంతలో అడ్డాకులు కొనుగోలు చేసిన వ్యాపారులు (ఫైల్)

చదువు కోసం అవస్థలు ఇంకెన్నాళ్లు?

» మారుమూల గిరిజన విద్యార్థుల సమస్యలపై ఆందోళన



ఆందోళన చేస్తున్న కళ్యాణగుమ్మి, కడరేవ్, తదితర గ్రామాల గిరిజనులు

అనంతగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గిరిజన విద్యార్థులు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గుమ్మ, పినకోట రెండు పంచాయతీల్లోని కళ్యాణగుమ్మి, కడరేవ్ గ్రామాలకు చెందిన సుమారు 30 మంది, అలాగే, కొట్టెంగూడ, గొప్పులపాలెం గ్రామాలకు చెందిన నాలుగురు విద్యార్థులు చదువుకునేందుకు అష్టకష్టాలు పడుతుండడంతో ఆదివారం ఆయా గ్రామాల గిరిజనులు ఆందోళన చేపట్టారు.. గెడ్డలు, వాగులు దాటుకుంటూ సుదూరం ప్రయాణం చేస్తే తప్ప పాఠశాలకు చేరుకోలేని పరిస్థితి ఉందని వాపోయారు. కళ్యాణగుమ్మి, కడరేవ్‌కు చెందిన విద్యార్థులు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని చింతలపూడి పంచాయతీ బోడుగరువు ఎంపీపీ పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. అయితే, రానుపోను 6 కిలో మీటర్లు ఉంటుంది. అలాగే , కొట్టంగూడ, గొప్పులపాలెం నాలుగురు విద్యార్థులు బోడిగరువు పాఠశాలలో చదుకుంటున్నారు. వీరికి రానుపోను సుమారు 8 కిలో మీటర్లు ప్రయాణంచాల్సి వస్తోంది. మధ్యలోని గెడ్డలు ఉండడంతో తీవ్ర అవస్థలు పడుతున్నట్టు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవరాపల్లి మండలం నేరళ్లపూడి నుంచి కళ్యాణగుమ్మికి 2024లో ఉపాధిహామీ పథకంలోని రూ.కోటితో జీఎస్‌బీ రోడ్డు పనులకు నిధులు మంజూరైనా, అటవీశాఖ అనుమతులు లేక రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. దీంతో విద్యార్థులకు కాలిడనకనే రాకపోకలు సాగించక తప్పటం లేదు. రోడ్డు పనులకు అటవీశాఖ అనుమతులు మంజూరు చేయాలని, గిరిజనులు కోరుతున్నారు.

సందిగ్ధంలో చెరకు రైతు

... 5వ పేజీ తరువాయి

సాగు మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో డిస్టిలరీ ఏర్పాటు చేస్తామని కూటమికి చెందిన అనకాపల్లి ఎంపీ, చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు ప్రకటనలు చేస్తున్నారు. అయితే అది ఎప్పటికి సాకారం అవుతుందన్న దానిపై స్పష్టత కొరవడింది. వాస్తవానికి డిస్టిలరీ లేదా ఇథనాల్ ప్లాంట్ ప్రారంభించాలంటే షుగర్ ఫ్యాక్టరీని రన్నింగ్‌లో ఉంచుతూ, చెరకుతోపాటు ఇతర పంటలు పండించేలా రైతులను సమాయత్తం చేయాలి. అధికారులు, పాలకులు ఈ దిశగా చర్యలు చేపడితేనే గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మనుగడ సాధ్యం అవుతుందని రైతులు, కార్మికులు అభిప్రాయపడుతున్నారు. కానీ ఇప్పటి వరకూ ప్రభుత్వపరంగా, ప్రజాప్రతినిధుల పరంగా యాజమాన్యం నుంచి ఎలాంటి హామీలు రాకపోవడంతో గోవాడ భవితవ్యంపై చెరకు రైతుల్లో నెలకొన్న అనుమానాలకు నివృత్తి లభించదు. ఈ అనిశ్చితికి తెరదించాల్సిన బాధ్యత అధికార పార్టీ ప్రజాప్రతినిధులపైనే వుందని.

నజరానాకు నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

రూ.5.25 కోట్లు విడుదల చేసినట్టు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సంబంధిత గ్రామ పంచాయతీలు ట్రెజరీలో బిల్లులు సమర్పించాయి. తీరా బిల్లులు అప్‌లోడ్ చేసిన తరువాత ఖాతాల్లో తగినన్ని నిధుల లేవు అంటూ సమాచారం వచ్చింది. ఈ విషయమై పలుమార్లు రాష్ట్ర కమిషనరేట్‌కు జిల్లా పంచాయతీ అధికారులు నివేదించినా ఫలితం లేకపోయింది. మరికొద్ది రోజుల్లో ఆర్థిక సంవత్సరం (2021-22) ముగిసిపోవడంతో ప్రోత్సాహకాల కింద విడుదల చేసిన నిధులు మురిగిపోయాయి. ఆ తరువాత సర్పంచులు ఎన్ని పర్యాయాలు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. మరోవైపు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చిన వైసీపీ ప్రభుత్వం.. ప్రజలు ఎన్నుకున్న సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది.

మూడేళ్ల తరువాత గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి, కూటమి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా ఖాజానాకు మళ్లించుకోకుండా గ్రామ పంచాయతీలకే కేటాయించింది. దీంతో సర్పంచులు ఎంతో సంతోషించారు. అదే విధంగా ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు కూడా విడుదల చేస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. తమ పదవీ కాలంలో మరో ఎనిమిది నెలలు మాత్రమే వుందని, ఈలోగానే ఏకగ్రీవ ప్రోత్రాహక నిధులు విడుదల చేస్తే, పది కాలాలపాటు గుర్తుండిపోయే అభివృద్ధి పనులు చేయిస్తామని చెబుతున్నారు

మండలాల వారీగా ఏకగ్రీవం అయిన పంచాయతీల సంఖ్య... ఎలమంచిలి-2, రాంబిల్లి-7, అచ్యుతాపురం-5, మునగపాక-3, మాడుగుల-4, కె.కోటపాడు-5, దేవరాపల్లి-2, చీడికాడ-5, చోడవరం-3, బుచ్చెయ్యపేట-6, కశింకోట-2, రావికమతం-5, నక్కపల్లి-5, గొలుగొండ-3, కోటవురట్ల-4, పాయకరావుపేట-2, రోలుగుంట-1, మాకవరపాలెం-1, ఎస్.రాయవరం-1, జీకేవీధి-3, జి.మాడుగుల-1, కొయ్యూరు-1, పెదబయలు-1, భీమునిపట్నం-3, ఆనందపురం-4, పద్మనాభం-2, పెందుర్తి-1, పరవాడ-1, సబ్బవరం-3.

పల్లా సింహాచలానికి కన్నీటి వీడ్కోలు

... 5వ పేజీ తరువాయి

కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధరప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, తదితరులు పల్లా సంహాచలం భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కొత్త గాజువాకలోని శ్మశానవాటికకు తరలించారు. పెద్ద కుమారుడు శంకరరావు తండ్రి చితికి నిప్పంటించారు. పోలీసులు తుపాకీలతో గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు.

ఏపీఈఏపీ సెట్‌లో 77.92 శాతం ఉత్తీర్ణత

... 5వ పేజీ తరువాయి

332 మంది పరీక్ష రాయగా 286 మంది అర్హత సాధించారు.

భరణికం విద్యార్థికి 381వ ర్యాంకు

పరవాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో మండలంలోని భరణికం గ్రామానికి చెందిన పెదిశెట్టి శ్రవణ్ 381వ ర్యాంకు సాధించాడు. మొత్తం 160 మార్కులకుగాను ఇతనికి 111 మార్కులు వచ్చాయి. సీఎస్ఈలో చేరి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా స్థిరపడాలన్నదే తన లక్ష్యమని శ్రవణ్ వెల్లడించాడు.

వమ్మవరం విద్యార్థికి 525వ ర్యాంకు

ఎస్.రాయవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరం గ్రామానికి చెందిన కర్రి హేమంత్ 525వ ర్యాంకు సాధించాడు. రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యాసంస్థల్లో ఇంటర్ చదివిన ఇతను జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఈడబ్ల్యూఎస్‌లో 950వ ర్యాంకు పొందాడు. కాన్పూర్ ఐఐటీలో సీటు సాధించి, ఇంజనీరింగ్ పూర్తయిన తరువాత సివిల్స్ లక్ష్యమని చెప్పాడు.

“పేట విద్యార్థికి 761వ ర్యాంకు

పాయకరావుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటకు చెందిన జి.సాయి అనీశ్ 761వ ర్యాంకు సాధించాడు. మొత్తం 160 మార్కులనుగాను 102 మార్కులు వచ్చాయి. ఇతను స్థానిక శ్రీప్రకాశ్ విద్యా సంస్థల్లో ఇంటర్ చదివాడు. మంచి పేరున్న ఇంజనీరింగ్ కళాశాలల్లో సీఎస్ఈలో చేరతానని చెప్పాడు.

హెచ్‌ఎంలు, ఎంఈవోలకు డిప్యూటీ డీఈఓలుగా పదోన్నతులు కల్పించాలి

... 5వ పేజీ తరువాయి

అజెండాతో విపరీతమైన ఒత్తిడి పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి లోనై అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ఇతర శాఖల్లో రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన వారు డీఈవోలు, ఆర్‌జేడీలుగా రిటైర్ అవుతున్నారని, కానీ 16 నుంచి 20 సంవత్సరాల సర్వీసు చేసిన హెచ్ఎం, ఎంఈవోలు ప్రమోషన్ లేకుండా రిటైర్ అయిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలమల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే పీఆర్సీ వేసి, ఐఆర్ ప్రకటించాలని, ఉద్యోగులకు డీఏ బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి సీవీవీ సత్యనారాయణ, సహాధ్యక్షుడు వి.నూకరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఏవీహెచ్ శాస్త్రి, కార్యదర్శి ఎంజే రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతిదేవి విగ్రహం ఆవిష్కరణ



నాతవరం హైస్కూల్‌లో సరస్వతిదేవి విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

నాతవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం 1997-98 టెన్త్ బ్యాచ్ పూర్వపు విద్యార్థులు లక్ష రూపాయలతో ఏర్పాటు చేసిన సరస్వతిదేవి విగ్రహాన్ని ఆదివారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత సాయి మాస్టారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు పూర్వపు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్‌పామ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు, అంకంరెడ్డి రాంబాబు, టీడీపీ నాయకుడు ఇటంశెట్టి సీతా రామ్మూర్తి, పాఠశాల చైర్మన్ చిటికెల శ్రీను, మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు, ఎంఈఓ వరహాలబాబు, అపిరెడ్డి మాణిక్యం, అంకంరెడ్డి యర్రాపాత్రుడు, పైల సూరిబాబు తెలుగుయువత మండల అధ్యక్షుడు శెట్టి లోవ, పాఠశాల హెచ్‌ఎం కూండ్రపు సత్యనారాయణ, ఏపీటీఎఫ్ నాయకులు ఎస్.జగన్నాథరావు, అప్పన్నబాబు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు యోగా శిక్షణ



యోగాసనాలు వేస్తున్న సీనియర్ సిటిజన్స్

నర్సీపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీనియర్ సిటిజన్లకు యోగాసనాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆదివారం ప్రైవేటు స్కూల్ ఆవరణలో జరిగిన శిక్షణలో 15 మందికి పైగా సీనియర్ సిటిజన్స్, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ జంపా సురేంద్ర మాట్లాడుతూ 21వ తేదీన యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రతిభా అవార్డుకు ఎంపికైన విద్యార్థినికి అభినందనలు

నర్సీపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాలలో 983 మార్కులు సాధించిన కారుణ్య కళాశాల విద్యార్థిని బొజ్జి కిరణ్ దీప్తిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా అవార్డుకు ఎంపిక చేసింది. ఆదివారం విద్యార్థినికి కళాశాల యాజమాన్యం ప్రతినిధులు అభినందనలు తెలిపారు. విద్యార్థిని అంకితభావంతో చదవడం వలనే ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిందని చైర్మన్ రాజు, ఎస్.జోగారావు అన్నారు.

అసంపూర్తిగా కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ ప్రహరీ

- పశువులు, పందుల సంచారం
- 24 గంటల పీహెచ్‌సీకి నైట్ వాచ్‌మన్ కూడా లేరు

కృష్ణాదేవిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ అసంపూర్తిగా ఉంది. దీంతో పీహెచ్‌సీ సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీ 24 గంటల ఆసుపత్రి కావడంతో రాత్రి వేళల్లో పదుల సంఖ్యలో రోగులు వస్తుంటారు. దీంతో ప్రహరీ లేకపోవడంతో అటు వైద్య సిబ్బందికి, ఇటు రోగులకు రక్షణ లేకుండా పోయింది. నైట్ వాచ్‌మన్ పోస్టు ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోలేదు. గత వైసీపీ పాలనలో ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు కాగా.. అసంపూర్తిగా వదిలేశారు. దీంతో పశువులు, పందులకు నిలయంగా మారింది. అంతేకాకుండా రాత్రి వేళల్లో బహిర్భూమిగా స్థానికులు వినియోగించుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పీహెచ్‌సీ ప్రహరి పూర్తికి నిధులు మంజూరు చేయాలని వైద్య సిబ్బంది కోరుతున్నారు.



కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ ఆవరణలో పశువుల గుంపు

భిన్నంగా వార్తలు రాస్తేనే గుర్తింపు

- ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందరం

నర్సీపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వార్తలను భిన్నంగా రాస్తేనే జర్నలిస్టులకు వృత్తి పరమైన గుర్తింపు వస్తుందని ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందరం అన్నారు. ఆదివారం నర్సీపట్నం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన జర్నలిస్టుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ పాత్రికేయ వృత్తిని నిబద్ధతతో నిర్వర్తిస్తే జర్నలిస్టులుగా రాణిస్తారన్నారు. వార్తలు రాసేటప్పుడు సమస్యను ఎత్తి చూపాలి తప్పితే వ్యక్తిగతంగా ఎవర్నీ టార్గెట్ చేయకూడదన్నారు. సీనియర్ జర్నలిస్ట్ మేడపాటి శ్రీనివాసరెడ్డి వ్యక్తిగత ఆరోపణల వార్తలు రాసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు చేతులు మీదుగా జర్నలిస్టులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. శిక్షణ తరగతులను గణపతిరాజు బంగారరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హాస్యయోగ బోధకుడు టి.గంగాధర్, ఏపీఈఎంజేఏ రాష్ట్ర కార్యదర్శి కిషోర్, ఏపీయూడబ్ల్యూజే నర్సీపట్నం అధ్యక్షుడు విజయ్, కార్యదర్శి శ్రీనివాసవర్మ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు స్వామి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నానాజి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐజేయూ కార్యదర్శి సోమసుందరం

ఆరుగురు విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

నర్సీపట్నం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆరుగురు విద్యార్థులను ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేసిందని మండల విద్యాశాఖ అధికారి తలుపులు తెలిపారు. మంగళవారం అనకాపల్లిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రూ.20 వేలు నగదు పురస్కారంతో విద్యార్థులను సత్కరిస్తారని తెలిపారు. ప్రతిభా అవార్డుకు ఎంపికైన వారిలో నర్సీపట్నం భాష్యం స్కూల్ విద్యార్థి తోట టీవీ చిరంజీవి కార్తికేయ, జెడ్పీహెచ్ స్కూల్ (మెయిన్) విద్యార్థి పేరూరి మల్లికార్జునరావు, శ్రీ చైతన్య విద్యార్థులు దన్నిన తేజస్వి, మిర్యాల నవ్యశ్రీ, పోతల కేశవ ప్రియ, శ్రీవిద్యాంజలి విద్యార్థి పాడి ప్రశాంత్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులంతా కలిసి గ్రూపు ఫొటో తీసుకున్న దృశ్యం

మాకవరపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూరుగుపాలెం హైస్కూల్‌లో 2004-2005 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. హైస్కూల్‌లో విద్యార్థులు కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదివే రోజుల్లో చేసిన అల్లరితోపాటు తీపి ఘటనలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో 80 మంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ శ్రేణులు దాడి

మాకవరపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండ లంలో రామన్నపాలెంలో వైసీపీ కార్యకర్తల దాడిలో టీడీపీ కార్యకర్త తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాలిలా ఉన్నాయి.



గాయపడిన నాగరాజు

మండలంలోని రామన్నపాలెం పంచాయతీ శివారు చినరాచపల్లి గ్రామానికి చెందిన కశిరెడ్డి నాగరాజు శనివారం సాయంత్రం పొలానికి వెళుతుండగా కొందరు బైక్‌లపై వచ్చి తనను ఢీకొట్టారు. దీంతో ఆయన కింద పడిపోయాడు. పైకి లేచి ప్రశ్నించడంతో తనను మళ్లీ కొట్టారని, ఈ సమయంలో చేతికి గాయమైందని నాగరాజు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో చుక్కా ఎర్రినాయుడు షాపు వద్ద తాను ఉండగా.. వైసీపీ కార్యకర్తలు చింతల రామకృష్ణ, సుర్ల కార్తీక, చింతల సతీష్ వచ్చి దాడి చేశారన్నారు. వారిలోని చింతల రామకృష్ణ అనే వ్యక్తి తన చేతిలో ఉన్న స్టీల్ కడియంతో ముఖంపై దాడి చేయడంతో తలపై కన్నం పడిందని పేర్కొన్నాడు. తాను స్పృహ తప్పి పడిపోగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులతోపాటు టీడీపీ కార్యకర్తలు రావడంతో వారంతా పారిపోయారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ. దామోదరనాయుడు తెలిపారు.

నిరుపయోగంగా రైతు సేవా కేంద్రం

మాకవరపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించిన రైతు సేవా కేంద్రం భవనం నిరుపయోగంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో రూ.25లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్ర భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే భవనం వృథాగా ఉండడంతో వాహనాల పార్కింగ్‌గా తయారైంది. రైతు సేవా కేంద్రం లేకపోవడంతో తామరం గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి విత్తనాలు, ఎరువులు తెచ్చుకుంటున్నామని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుసేవా కేంద్ర భవనాన్ని పూర్తి చేయాలని రైతులు ఈ సందర్భంగా కోరుతున్నారు.



వాహనాల పార్కింగ్ స్టాండ్ మారిన రైతు సేవా కేంద్రం

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఫిర్యాదు



యోగా శిక్షణను పరిశీలిస్తున్నఅసోసియేషన్ ఉపాధ్యక్షుడు సతీశ్

రావికమతం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు వెనుక ఉండి ఓ మీడియా ఛానల్లో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ చోడవరం నియోజక వర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి ఆదివారం కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. లైవ్ డిబేట్‌లో రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులను, వీటికి పరోక్షంగా ప్రోత్సహించిన వైసీపీ నాయకుడు కొమ్మినేని శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం.శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. తప్పుడు వ్యాఖ్యలతో మహిళల ఆత్మ గౌరవం దెబ్బతీసేలా మాట్లాడిన వీరిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు రాజాన కొండనాయుడు, టీడీపీ నాయకులు కోట గోవిందరావు, కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, వెల్లంకి ఈశ్వరావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవం విజయవంతం చేయండి



యోగా శిక్షణను పరిశీలిస్తున్నఅసోసియేషన్ ఉపాధ్యక్షుడు సతీశ్

చోడవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈ నెల 21న ప్రధానమంత్రి మోదీ హాజరుకానున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని యోగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లేటి సతీశ్ విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు పిలుపుమేరకు స్థానిక గాంధీగ్రామంలో అధికారుల ఆధ్వర్యంలో యోగా మాస్టారు భోగవిల్లి గణేశ్ ఆధ్వర్యంలో తలపెట్టిన యోగాంధ్ర ప్రొటోకాల్ శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ గాడి అప్పారావు, ఈవోపీఆర్‌డీ మహేశ్, పంచాయతీ కార్యదర్శి రామునాయుడు పంచాయతీ వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జనసేన నేత రాజు

బుచ్చెయ్యపేట జూన్ 8 (ఆంధ్రజ్యోతి) మండలంలో రాజాం గ్రామంలో జనసేన కార్యకర్తలు, వీఎస్ ఆర్ సేవా ట్రస్ట్ సభ్యుడు వడ్డి సత్యారావు సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ప్రారంభించారు. విశాఖకు చెందినపలు కార్పొరేట్ ఆసుపత్రుల నుంచి వైద్యులు 350 మందికి ఈసీజీ రక్త పరీక్షలు, ఇతర వైద్య సేవలు అందించారు. విశాఖ మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆసుపత్రి అంకాలజిస్ట్ పాల్, మురళీకృష్ణ, హరిక , పీఎం నాయుడు, ఎన్ ఆర్ఐ ఆసుపత్రి వైద్యనిపుణులు పరమేశ్వరరావు, హరికిశోర్, సుజిత్ కూమార్, సౌమ్య, హేమంత్, సుజాత త్రినాద్, సేవలందించారు. జనసేన కార్యకర్తలు కోట శేషు, కోటఅమర్, పాల్గొన్నారు.

పప్పుశెట్టిపాలెంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి

గొలుగొండ, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పప్పుశెట్టిపాలెంలో వారంరోజులుగా వైరల్ జ్వరాలు విజృంభించాయి. దీంతో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టి బ్లీచింగ్ చల్లాలని కోరారు.ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో దోమల బెడద అధికంగా వుందని వారు వాపోయారు.

షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం

దేవరాపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన గుంపాన ఉదయ్ కుమార్, మురికితి దేవానంద్, చెరుకూరిమౌనిక, శ్రీనాథ జయకృష్ణ, పెంటా జయశ్యాంకుమార్, బి.హర్షిత ఎమ్మెల్యే బండారు.సత్యనారాయణమూర్తి ఆదివారం సత్కరించారు. అనంతరం ముషిడిపల్లికి చెందిన దివంగత డబ్బూరు సన్యాసయ్య, అప్పలనర్సమ్మ దంపతులు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సమకూర్చిన ప్రోత్సాహక బహుమతులను ఆయన అందజేశారు. ముందుగా మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే మూర్తి ప్రారంభించారు. మాజీ ఎంపీపీ కిపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, సర్పంచ్ పెంటమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ.వెంకటరమణ, దొగ్గనాయుడు, జనసేన నాయకుడు రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

కె. కోటపాడులో..

కె.కోటపాడు: షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులను ఈ నెల 9వ తేదీన సత్కరించనున్నట్టు స్థానిక ఎంఈఓ కె. సత్యనారాయణ తెలిపారు. మండల స్థాయిలో గొండుపాలెం హైస్కూల్‌కు చెందిన సత్యవరపు సాహితీ, కె.కోటపాడు వేణు విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన కొట్యాడ భవాని, పొన్నగంటి జస్వంత్, జాగరపు దుర్గా హేమని, పాతవలస హైస్కూల్‌కు చెందిన కాకర్ల అలేఖ్య ఎంపిక చేశామన్నారు. .



విదార్థులతో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

పది మంది విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

చీడికాడ: మండలంలో పదిమంది విద్యార్థులకు ప్రభుత్వం ప్రతిభా అవార్డులకు ఎంపిక చేసినట్టు స్థానిక ఎంపీవోలు కె.బొంజుబాబు, డి.డి. రమణలు తెలిపారు. వీరిలో మంచాల మోడల్ స్కూల్ నుంచి పి.లహరి, కె.శేఖర్, అప్పలరాజుపురం జడ్పీ హైస్కూల్ నుంచి ఎం. ఆశాజ్యోతి, కె.జోష్న, చీడికాడ కేజీబీవీ నుంచి ఎం.మౌనిక, కోనాం ఏపీ గురుకుల బాలికల పాఠశాలనుంచి ఎల్.తనుశ్రీ, ఎస్.లీలావతి, ఎస్.భారతి, జి.అంకిత, ఎస్.అనూషలు ఉన్నారన్నారు.

భూలోకమ్మ ఆలయ ప్రారంభోత్సవం



అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, నాయకులు

రావికమతం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):మండలంలో గుడిప గ్రామంలో భూలోకమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షులు రాజాన కొండనాయుడు, జనసేన కార్యదర్శి రమేష్‌బాబు, సుంకర కోటి, నాయకులు కొండయ్య,నానిబాబు తదితరులు పాల్గొన్నారు. వీరందరికీ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.అనంతరం ఆవరణలో మొక్కలను ఎమ్మెల్యే నాటారు.

భూసార పరీక్షలు శ్రేయస్కరం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సత్తిబాబు

రావికమతం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటలు సాగు చేసుకుంటే లాభదాయకమని కేవీకే శాస్త్రవేత్త డా.ఎన్. సత్తిబాబు అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేతల బృందం ఆధ్వర్యంలో ఆదివారం చినపాచిల రైతులతో ప్రత్యక్ష సంభాషణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ, తొలకరిలో చేపట్టాల్సిన యాజమాన్య చర్యలను రైతులకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాయితీలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో చినపాచిల సర్పంచ్ కోమటి రామలక్ష్మి, ఉపసర్పంచ్ శంకరావు, ఏవో రూప, నోడల్ ఆఫీసర్ టి.కిరణ్‌కుమార్, ఎం. వెంకటేష్, ఎంపీఈఓ మాధురి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

బుచ్చెయ్యపేట జూన్ 8 (ఆంధ్రజ్యోతి) మండలంలో వడ్డాది హైస్కూల్‌లో 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 26 సంవత్సరాల తరువాత ఆదివారం ఒక్కచోట కలిసి చిన్ననాటి సంఘటనలు గుర్తు చేసుకోన్నారు. ఈ బ్యాచ్ విద్యార్థి టీడీపీ అధ్యక్షుడు దొండా నరేశ్ సొంత నిధులతో పదవ తరగతి అత్యధిక మార్కులు కనబరిచిన విదార్థికి పురస్కారం అందించాలని, అలాగే, తమ బ్యాచ్ లో ఆర్థిక ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు చెందిన చిన్నారులను ఆదుకోవాలని తీర్మానించారు. 2001-02బ్యాచ్ విద్యార్థులు సమీవేశం నిర్వహించారు. ఆట పాటలతో గడిపారు.

సత్తెమ్మ ఘటాల ఊరేగింపు



ఘటాల ఊరేగింపులో భక్తులు

రావికమతం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సత్తెమతల్లి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్థులు ఘటాలతో పుర వీధుల్లో ఊరేంపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సమర్పించారు. గ్రామ శివారు పొలాల్లో ఉన్న ఈ అమ్మవారికి ఏటా జూన్ లో ఘనంగా పండగ నిర్వహించి, ఆపై విత్తనాలు పోస్తారు. ఇలా చేయడం వల్ల పంటలు సమృద్ధిగా పండుతాయన్న రైతుల విశ్వాసం. ఆదివారం వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

చీడికాడలో మోస్తరు వర్షం

చీడికాడ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఎండతో జనాలు ఇబ్బందులుపడ్డారు. మధ్యాహ్నం 3గంటలకు వర్షంతో ఉపశమనం పొందారు. ఈ వర్షం పశుగ్రాసానికి ఎంతో ఉపయోగపడుతుందని పలువురు రైతులు తెలిపారు.

ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్ డాక్టర్ డీడీ నాయుడుకు సత్కారం

అనకాపల్లి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్, వాసవీక్లబ్ ప్రతినిధులు డాక్టర్ డీడీ నాయుడును వేర్వేరుగా సత్కరించారు. ఇతను ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకా రం చేసి, బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వాసవీ క్లబ్ ప్రతినిధులు రాపేటి నారాయణరావు, కె.ద్వారకానాథ్, ఆర్ఎస్ఎస్ మహేశ్వరరావు, డి.లక్ష్మణరావు, ప్రతినిధులు సత్కరించారు.

రాజన్నపేట క్వారీ యాజమాని బరితెగింపు

- రెవెన్యూ అధికారులు తొలగించిన రోడ్డు పునర్నిర్మాణం

రోలుగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజన్నపేటలో క్వారీ యాజమాన్యం చెరువు ఆక్రమించి మధ్యలో నుంచి వేసిన రోడ్డును రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రోడ్డును గత నెల 9న జేసీబీతో తొలగించారు. అప్పటి నుంచి క్వారీలో మైనింగ్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. క్వారీ యజమాని బరితెగించి ఆదివారం ఉదయానికి ఈ రోడ్డును పునఃనిర్మించి మళ్లీ మైనింగ్ కార్యకలాపాలు కొనసాగించేందుకు సిద్ధం చేశారు. ఈ సమస్యను స్థానికులు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఈ క్వారీ యాజ మాన్యం అక్రమ మైనింగ్, చెరువు ఆక్రమణపై గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇకనైనా యాజమాన్యంపై చర్యలు తీసుకోకుంటే ప్రత్యక్షంగా పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.




ఆదివారం ఉదయం తొలగించిన రోడ్డును యథావిధిగా ఏర్పాటు చేసిన క్వారీ లీజుదారుడు



గత నెల 9న చెరువు మధ్యలో వేసిన రోడ్డును తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)

కరెంట్ తీగలు తగిలి కొబ్బరి చెట్టు దగ్ధం

బుచ్చెయ్యపేట జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది జంక్షన్ వి మాడుగుల వెళ్లే దారిలో నేషనల్ టాలెంట్ స్కూల్ వద్ద ఆదివారం సాయంత్రం విద్యుత్ తీగలు నుంచి వచ్చిన మంటలకు కొబ్బరి చెట్టు దగ్ధమైంది. ఆదివారం సెలవు కావడంతో స్కూల్ విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులు స్పందించి తక్షణ చర్య తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



విద్యుత్ తీగల రాపిడి మంటలకు కాలి పోతున్న కొబ్బరి చెట్టు